చదువుకుని అక్షరజ్ఞానం సంపాదించాలన్న కోరిక అందరికీ ఉంటుంది. అయితే, చదివిన చదువు తన తోటివారికి ఉపయుక్తం కావాలన్న ధృఢ చిత్తం ఎందరికుంటుంది?

# పంచాంగం దేముడు

గునుపూడి ఊరికి దక్షిణంగా, వెర్రిగెడ్డకి అవతల దూరంగా విసిరేసినట్టుంటుంది. మాలపేట. మాలపేటలో వన్నీ పూరిళ్లే. చుట్టు గుడిసెలే! ఆ గెడ్డ దాటి గునుపూడి ఊళ్లోకి చొచ్చుకుపోతే, కొంచెం ఉన్న రైత్వారీ కుటుంబాల పెంకుటిళ్లు. ఇంకా ఉత్తరపు చివర్లో ధనవంతుల భవంతులూ దర్శనమిస్తాయి. అసలు గునుపూడి అంటే అదే అని అర్థం. అక్కడి అధికార్లకీ, పెత్తందార్లకీ, బుగతలకీ ఊడిగం చేస్తూ, వారు పోసిన కలో గంజో తాగి జీవితాలు వెళ్లబెట్టుతూంటారు. ఈ మాలపేట జనాలు.

ఓనాటి అర్థరాత్రి వేళ ఆ పేటలోని ఓ గుడిసెలో పురిటి నొప్పులు పడుతోంది పరిదేశమ్మ. సాయంత్రమనగా మొదలయ్యాయి నొప్పులు. అర్థరాత్రి అయినా పురుడు రావడం లేదు. నొప్పులు భరించలేక పోతోంది పరదేశమ్మ. ఇరుగమ్మా, పొరుగమ్మా అప్పటికే చుట్టూ చేరారు. బుడ్డి దీపం మసక వెల్తురులో ఆమెను సముదాయిస్తున్నారు. "ఇంకెంత! ఒక్క పట్టు! కొంచెం బరాయించుకోవాలమ్మా!" అని నచ్చచెప్పుతున్నారు.

"ఓలమ్మో! నాకీ నొప్పులొద్దు బాబోయ్! నాకీ కాన్పు వద్దు బాబోయ్! ఓ పోలమ్మో! నాకీ పిల్లొద్దు తల్లీ!" అని అరుస్తోంది పరిదేశమ్మ. తడిక చాటు వేసిన గుడిసె ముందు నిలబడి ఆమె భర్త కిత్తడు, హృదయవిదారకమైన ఆమె అరుపులు వినలేక దూరంగా పోయి, ఇంటి ముందు కొబ్బరి చెట్టు మొదలు మీద తల పట్టుక్కూచున్నాడు. చిన్నగా వీచేగాలికి ఊగుతున్న కొబ్బరి చెట్టు కొమ్మల మధ్యలోంచి వెన్నెలా, నీడా పడుగూ, పేకాలా నేల మీద పడి ఊగిసలాడుతున్నాయి. అతని అంతరంగంలోని ఆశా, నిరాశల్లా నిర్లిప్తతతో అతనలాగే చూస్తూ కూర్చున్నాడు.

ఇంతలో తడిక తోసుకొని ఓ ముసలమ్మ బైటికి వచ్చి, "ఒరే! కిత్తా! ఇలారా" అని పిలిచింది. అతురతతో వచ్చిన కిత్తడితో ఆమె ఇలా అంది :

"నా తల్లి శానా కట్టపడతా వుందిరా! ఆడదానికిది పరీచ్చ మరి. నా మాటిని నువ్వు ముంతెడు పసుపు నీల్లు, చిన్న బెల్లం ముక్కా, అట్టు కెల్లి, అసారిగార్ని మంత్రించి ఇమ్మను. ఆ ముక్క తిని, ఆ నీల్లు తాగుతే సుకంగా కనగలుగతాది".

అది విన్న కిత్తడు సంశయిస్తూ, "ఇంత రాత్రప్పుడా? ఆరు పెద్దింటోరు, ఏమను కుంటారో!" అన్నాడు.

"పర్లేదు! పానాల మీది కొచ్చింది. ఏం చేయగలం? అయినా ఆరికిది అలవాటే. ఏమి అనుకోరు. బేగెల్లిరా" అంది ముంతెడు నీళ్లూ, బెల్లం ముక్కా చేతి కందిస్తూ.

అవి తీసుకుని ఉత్తర ముఖంగా బయల్దేరాడు కిత్తడు.

* * *

అర్ధరాత్రి సమయంలో వీధి గుమ్మం గొళ్లెం చప్పుడు విని, "ఎవరిదీ?" అంటూ వచ్చి తలుపు తీశారు ఆచారిగారు. హరికేన్ లాంతరు ఎత్తి పట్టుకుని కిత్తడిని ఎగాదిగా చూసి, "ఏరా! ఇంతరాత్రప్పుడొచ్చావు?" అని అడిగారు.

"బాబయ్యా! మా యింటిది నొప్పులు పడతావుంది నీల్లు మంత్రించి ఇత్తారని!" అన్నాడు కిత్తడు.

"ఓ! అదా!" అని ఆచారి గారు తూర్పుకి తిరిగి నమస్కారం చేసి, ఇష్టదైవాన్ని ప్రార్థించి, ఆ నీళ్ళూ, బెల్లమూ మంత్రించి ఇచ్చారు. అవి తీసుకుని పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్లి, ఆడంగుల కందించాడు కిత్తడు.

ఆ నీళ్లు తాగాక కూడా పరిదేశమ్మ కొన్ని గంటలు కష్టపడి, బ్రహ్మముహూర్తం సమయంలో పండంటి కొడుకుని కంది.

"తాటి పండంటి కొడుకుట్టాడే! పరిదేశీ! ఒద్దాన్నావుగందా! నే తీసేసుకోనా!" ఎగతాళి చేసింది పోలమ్మ.

"నేనివ్వ!" నీరసంగా నవ్వుతూ అంది పరిదేశమ్మ.

"కొడుకుట్టాడురా కిత్తా!" అన్న చల్లని మాట విని కిత్తడు తేలిక పడిన హృదయంతో ఆకాశం వైపు రెండు చేతులూ ఎత్తి భగవంతుడికి నమస్కరించాడు. అప్పటికి చుక్క బారెడు పొద్దెక్కింది.

తెల్లారి చల్ది గంజి త్రాగి ఆచారిగారి దర్శనం చేసుకున్నాడు కిత్తడు. "సుక్క బారెడు పొద్దెక్కిన టయానికి పురుడొచ్చింది బాబయ్యా! కొడుకుట్టాడు. ఏం పేరెట్టుకోమంటారు?" అని అడిగాడు.

ఆచారిగారు దేవతార్చన తొందరలో ఉండి, "దేవుడి పేరెట్టుకోరా!" అని చెప్పి లోపలికి వెళ్లిపోయారు.

కిత్తడు, ఇంటికి తొరిగొచ్చి తన కొడుక్కి 'దేముడు' అని పేరు పెట్టుకున్నాడు.

* * *

రోజులు గడుస్తున్నాయి. ఋతువులు మారుతున్నాయి. బాలారిష్టాలు గడిచి దేముడు బతికి బట్టకట్టాడు. అయిదూ, ఆరూ....ఏడూ....పదీ. దేముడు పెరుగుతున్నాడు. ఎండలకీ,

వానలకీ, చలికీ దూరం కాకుండా ప్రకృతి మాత ఒడిలో పెరుగుతున్నాడు. కానీ, వయసు వస్తున్న కొద్దీ వాడిలో ప్రశ్నలు, అంతులేని ప్రశ్నలు - వాడి చుట్టూ ఉన్న వాళ్లెవరూ జవాబు చెప్పలేని ప్రశ్నలు - వాడిని బాధించసాగాయి.

ఇలా తనకి నడవడం రాగానే చేతికో కర్ర ఇచ్చి, యజమానుల పశువుల వెంట పంపించారు తల్లిదండ్రులు. యజమానుల పిల్లలు వాడి వయసు వాళ్లే, ఇంట్లో తూగుటు య్యాలలో ఆడుకుంటూంటే తానెందుకు ఎండనక, వాననక వాళ్ల పశువుల్ని కాయాలో వాడి చిన్న బుర్రకి అంతు చిక్కేది కాదు. వాళ్లూ తనతో బాటుగా రాళ్ల, రప్పల మీద గెంతుతూ ఎండ వేడి తెలుసుకోవాలని ఉండేది. అడగాలనే తపన. అడిగితే ఎవరేమంటారో ననే భయం. కొంచెం పెద్దవాడయ్యాక తనకు మించిన బరువులు మోయడం, అందరి ఇళ్లల్లో చాకిరీ చేసి అలిసిపోయి రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోవడం, తన వయసు పిల్లలు బడికి వెళ్లి చదువుకుంటూంటే చూసి, ఇవన్నీ వదిలేసి తనూ బడికి పోయి చదువుకోవాలనే ఉబలాటం. తన కోరిక బైటపెడితే పెద్దవాళ్లు దండిస్తారనే భయం. అక్కడికీ ఉండబట్టలేక అప్పుడప్పుడూ అమ్మనీ, నాన్ననీ అడుగుతూండేవాడు - "అయ్యా! నేనూ ఆ పిల్లల్లా సదువుకుంటానే! ఆవుల్నీ గేదెల్నీ కాయనే!" అని.

"ఛ! నోర్ముయ్! ఆలు పెద్దింటోల్లు. సదుంకుని అల్ల పిల్లలు ఉజ్జోగాలు జేత్తారు. నీకెందుకు సదువు? పసుల్ని గాసెటోనికి. నువ్వేమైనా ఉజ్జోగాలు జేయాలా? ఊళ్లేలాలా? అయినా నువ్వు ఈ పని మానేసి సదుంకుందికిపోతే గంజెలా వొత్తాది? కూడెవులు పెడతారు? వరి కూడు, పప్పన్నం దినేవారికే చదువొత్తది. మనకావోగం లేదు. ఎదవ ఏసాలేయక పన్జూసుకో!" అని మందలించాడు తండ్రి కిత్తడు.

ఎంత చిన్న వయసయినా, దేముడి బుర్రకి ఇది అంతగా నచ్చేది గాదు. 'అందరి లాగే తనూ పుట్టాడు కదా! మరీ ఈ తేడా ఏమిటి? చిన్నప్పట్నుంచీ, ఆ పిల్లలకి కూడా చేతిక కర్ర ఇచ్చి పశువుల్ని కాయమంటే వాళ్లూ పశువుల కాపరులయ్యే వారు కదా! అలాగే తనకూ పలకా, పుస్తకం ఇచ్చి బడికి పంపుతే ఎందుకు చదువు రాదు? వాళ్లకీ తనకూ తేడా ఏమిటి? మరి ఈ బలవంతందేనికి? ఆలోచనలేగాని అంతు చిక్కేది కాదు దేముడికి.

ఒకే రకం మనుషులు, కానీ, మాల పేటకీ, ఊరికి ఉత్తరాన ఉన్న వారి భవంతులకీ, వాతావరణంలో ఎంత మార్పు!! ఇక్కడంతా అనాగరికత. అంతా గలీజు. అపరిశుభ్రత. భాషలో, భావంలో అంతా పేదరికం - ఇక్కడున్న వారిళ్లలాగే! వారి అంతస్థులు పెద్దవి. అక్కడంతా పరిశుభ్రతే. అది వీళ్లు బాగుచేసిందే! చక్కని వినసొంపైన భాష. మేం అధికులమనే భావన. వారింట్లో వడ్లు వీళ్ళు కష్టించి పండించినవే. అవి వీళ్ళు దంచి బియ్యం చేస్తేనే వాళ్లు వండుకు తింటారు. కానీ వీళ్లు మాత్రం అంటరాని వాళ్లు. అదెలా సాధ్యమో! ఎందుకీ విభేదం? తనూ వారిలా చదువుకుని అలా మాట్లాడలేడా? లేక అది కూడదా?

ఆలోచించిన కొద్దీ దేముడి బుర్ర వేడెక్కిపోతోంది. ఎప్పుడైనా తోటివారితో ఈ ప్రసంగం తీసుకొస్తే వాడిని, పిచ్చివాడిని చూసినట్టు చూసి ఎగతాళి చేసేవారు. ఇహ ఎవ్వరినీ అడిగి

ప్రయోజనం లేదని తెలుసుకుని తానే ఈ మథనకి సమాధానం తెలుసుకోవాలని పూనుకున్నాడు దేముడు.

***

పశువుల్ని కాసేవేళలో బడికి దగ్గరగా ఉంటూ ఆచార్లుగారు చెప్పే పాఠాలు కిటికీ దగ్గర నిలబడి శ్రద్ధగా వినేవాడు. ఆయన పిల్లలకి రాసిచ్చే అక్షరాల ప్రతిరూపాలు నేల మీద ఇసుకలో దిద్దేవాడు. ఆచార్లుగారి భాషా, ఉచ్ఛారణ, జాగ్రత్తగా విని ఆకళింపు చేసుకుని విరామ సమయంలో వాటిని మననం చేసుకునే వాడు. సాధన చేసిన కొద్దీ చదవడం, రాయడంలో ఉన్న మెళుకువలు పట్టుబడసాగాయి. అప్పుడప్పుడూ, పెద్దింటి పిల్లల్ని తనతో పొలాల్లోకి పట్టుకుపోయి, వాళ్లకి మామిడికాయలు, తాటికాయలు, నేరేడుపళ్లు లంచం ఇచ్చి, వాళ్ల చేత పద్యాలు చెప్పించుకుని నేర్చుకునే వాడు.

ఓ నాటి సాయంత్రం, ఆచారి మేష్టారు పేట నుంచి తిరిగి వస్తూ, పెద్ద చెరువు గట్టు మీద, వేమన పద్యాలు అచ్చంగా తన బాణీలో చదువుతున్న దేముణ్ని చూసి ఆశ్చర్యపోయారు. 'వీడెప్పుడూ బడికి వచ్చినట్టు కూడా లేదే? ఇదెలా సాధ్యం?!' అని సందేహించి, "ఒరే దేముడూ ఇలా రా!" అని కేకేశారు. "నువ్వీ పద్యాలు ఎక్కడ నేర్చుకున్నావురా?" అని అడిగారు.

"మీ వద్దనే గురువుగారూ! ప్రతిదినమూ మీరు పిల్లలకి పాఠాలు చెప్పుతూండగా, కిటికీ దగ్గర నిలబడి వినీ, మీ శిష్యుల చేత మళ్లీ చెప్పించుకునీ నేర్చుకున్నాను" అన్నాడు దేముడు.

చిత్తశుద్ధితో వాడు సాధించిన దానికి అబ్బురపడుతూ, ఆచారిగారు, "దేముడూ! నీకు చదువుకోవాలని ఉందేమిట్రా?" అని అడిగారు.

"అవునండీ! మా నాళ్లెవరూ వప్పుకోవడం లేదు. ఈ పాలికాపుతనం పోతే, వారి బతుకు తెరువు పోతుందని వారి భయం. ఎంత కష్టపడయినా నాలుగు ముక్కలు నేర్చుకోవాలని నా తాపత్రాయం. అందువల్ల స్వయంకృషితో ఈ మాత్రం నేర్చుకోగలిగాను" అన్నాడు దేముడు.

ఆ సమయంలో వాడి కళ్లలో వెలుగు, వాడి భావ ప్రకటనలోని స్పష్టత కనిపెట్టిన ఆచారిగారు వాడిలో బాగా చదువుకుని పైకి రాగలిగిన మనిషిని చూశారు. 'ఏమో! ఏ పుట్టలో ఏ పాముందో! సరస్వతీ కటాక్షం ఎవరి మీద ఎప్పుడు ప్రకాశిస్తుందో! ఎవరు చెప్పగలరు. లేకపోతే ఈ నిమ్నజాతి బాలుడిలో అంత తీక్షణమైన కాంతి ఏమిటి?' అని ఆలోచించి, "సరే! సాయంత్రం మా యింటికి రా! మీ అయ్యతో చెప్పి చదువుకి ఏర్పాటు చేస్తాను" అని చెప్పి ఇంటికి వెళ్ళారు.

***

ఆ సాయంత్రం ఇంటికి వచ్చిన కిత్తడితో ఆచారిగారు, "కిత్తా! దేముడికి బాగా చదువు వచ్చేలాగుందిరా! బడికి పంపగూడదూ!" అన్నారు.

దానికి వాడు, "ఈ సదువులు, సట్టుబండలూ, మాకెందుకు బాబయ్యా! ఈడు కూలి పని మానేస్తే మా రోజెలా గడవాలి?" అన్నారు.

వాడి ధర్మసంకటం అర్థం చేసుకున్న ఆచారిగారు, "సరే అయితే! పొద్దస్తమానం వాడు చేసే కూలిపని చేసుకోనీ కానీ ప్రతిరోజూ, రాత్రుళ్లు నా దగ్గరికి పంపించు. వాడికి నేను చదువు చెప్పుతాను"అన్నారు.

కిత్తడు కాదనలేదు.

దేముడి ఆనందానికి అవధుల్లేవు.

ఆచారిగారి బోధనలో అనతికాలంలోనే చక్కగా వ్రాయను, చదువను నేర్చేసుకున్నాడు దేముడు. ఏకాగ్రతతతో చెప్పినవన్నీ మరిచిపోకుండా నేర్చుకునే దేముణ్ని చూసి ఓనాడు ఆచారిగారు, "దేముడూ! నీకేం చదువుకోవాలని ఉందిరా?" అని అడిగారు.

అప్పుడు దేముడు తన కోరిక ఇలా వెలిబుచ్చాడు.

"గురువుగారూ! నాతోటి వారంతా అక్షరజ్ఞానం లేనివారు. వారి మంచేమిటో, చెడేమిటో వారికే తెలియని అధ్వాన్నస్థితి వారిది. అన్నింటికీ ఇతరుల మీదే ఆధారం. కడుపుకు తిండీ, వంటికి బట్టా కూడా ఒకరిస్తే తప్ప గతి లేదు. ఆఖరికి ఓ శుభకార్యం చేయాలన్నా, మంచి రోజంటే తమ వంటి వారిని ఆశ్రయించాలి. పుట్టిన పిల్లకి పేరెట్టుకో వాలంటే, అదీ మీరే చెప్పాలి. ఇలా ఆలోచించగా వారికున్నది 'లేమి' ఒక్కటే ననిపిస్తోంది. అందుకే, నేనేం నేర్చుకున్నా మా వాళ్లకి ఉపయోగపడేదిగా ఉండాలన్నదే నా ధ్యేయం. పెద్ద చదువులు చదివి, ఊరొదిలి పోయేకంటే, ఇక్కడి వాళ్లకి మంచీ చెడూ చెప్పుతూ వారి అభివృద్ధికి పాటుపడాలని నా ఉద్దేశం. అందుకే నాదో చిన్న కోరిక. నాకు పంచాంగం చూసుకోవడం, మంచి రోజులు, ముహూర్తాలు తెలుసుకోవడం లాంటివి నేర్పండి. ఆ విధంగా వారికి నేను ఉపయోగపడితే అదే చాలు."

దేముడి మనసులో చదువు నేర్చుకోవాలనే తీవ్రమైన వాంఛకి కారణం అప్పుడూహించ గలిగారు ఆచారిగారు.

చదువు మళ్లీ మొదలైంది.

"పంచాంగం అంటే అయిదు అంగాలున్నది అని అర్థం. ఆ అయిదూ ఏమిటంటే, తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములు అనేవి. ఒక్కొక్క ఘడియలో కొన్ని అంగాల కూటమికి అనివార్యమైన బలం ఉండడం మూలాన, ఆ సమయంలో చేసే పనుల మీద వాటి ప్రభావం పడుతూ ఉంటుంది....."

ఆ విధంగా దేముడు పంచాంగంలో నిష్ణాతుడయి, గునుపూడిలో 'పంచాంగం దేముడు'గా ప్రసిద్ధుడయ్యాడు. ఒకనాడు వాడు చదువు కోసం పరితపిస్తుంటే వాడిని చూసి నవ్విన వాళ్ళంతా సంవత్సరాదినాడు సంక్రాంతి పురుషలక్షణం తెలుసుకోవాలన్నా, సంవత్సర ఫలం తెలుసుకోవాలన్నా 'పంచాంగ శ్రవణానికి' ఎక్కడికోపోయి దూరంగా కూర్చోనక్కర్లేదు. ✷